ప్రజాశక్తి
గురువారం 20 జూన్ 2024





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి.శ్రీనివాస్



కరువుపై అనంతపురం కలెక్టరేట్లో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్ర కరువు బృందం

# నిన్న విన్నారు.. నేడు చూస్తారు..!

- ◆ ఉమ్మడి జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటన
- ◆ అనంత కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష
- ◆ ఉరవకొండ ప్రాంతంలో నేడు పరిశీలన

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

రబీ 2023 పంటనష్టం పరిశీలనకు కేంద్ర కరువు బృందం ఉమ్మడి అనంతపురం జిల్లాకు విచ్చేసింది. బుధవారం మొదటి రోజు అధికారులతో సమీక్షలో కరువు పరిస్థితుల గురించి సమీక్ష జరిపారు. ఈ సమీక్షలో కరువు మండలాల్లోని పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం వరకు ఇది కొనసాగింది. అనంతరం మధ్యాహ్నం నుంచి సత్యసాయి జిల్లాలోని రొద్దం మండలానికి ఒక బృందం, కర్నూలు జిల్లాకు ఒక బృందం బయలుదేరి వెళ్లింది. రాత్రికి తిరిగి అనంతపురం నగరానికే చేరుకుంది. ఈ బృందం గురువారం నాడు ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరువూరు, కణేకల్ మండలాల్లో క్షేత్రస్థాయి పర్యటన జరపనుంది.

**అధికారుల సమీక్షలో విన్నారు..**

కరువు పరిశీలనకు వచ్చిన బృందానికి డిపార్టుమెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ రితీష్ చౌదరి, డిపార్టుమెంట్ ఆఫ్ ఎక్స్‌పెండేచర్ డైరెక్టర్ చిన్మయ్ పుండ్లిక్ రావ్ గోత్మారేలు పాల్గొన్నారు. ఇక్కడ జరిపిన సమీక్షలో రాష్ట్ర స్థాయి పరిస్థితులను రెవెన్యూ డిజాస్టర్ మేనేజమెంట్ డైరెక్టర్ కూర్మనాథ్ వివరించారు. అనంతపురం జిల్లాకు సంబంధించి కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ వివరించారు. జిల్లాలో 14 మండలాల్లో కరువు నెలకొందని చెప్పారు. రబీలో 50 నుంచి 70 శాతం పంట నష్టం సంభవించిందని కేంద్ర కరువు బృందం దృష్టికి తీసుకెళ్లారు. 53,014 హెక్టార్లలో పంటనష్టం సంభవించిందని చెప్పారు. రూ.45.06 కోట్లతో ఇన్‌పుట్ సబ్సీడీకి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని వివరించారు. జిల్లాలో ఐదు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులుంటే నాలుగు ట్యాంకుల్లో నీరు లేకుండాపోయిందన్నారు. వ్యవసాయానికి రూ.45.06 కోట్లు, పశుసంవర్ధక శాఖ కింద రూ5.38 కోట్లు, గ్రామీణ నీటిపారుదల కింద రూ.3.05 కోట్లు, అర్బన్ వాటర్ సప్లై కింద రూ.3.17 కోట్లు, ఉపాధి హామీ పథకం కింద రూ.78.60 కోట్లు, కలిపి మొత్తం రూ.135.26 కోట్లు నిధులు అవసరమని ప్రతిపాదించినట్టు కరువు బృందానికి వివరించారు. సమీక్ష అనంతరం కరువు బృందం సత్యసాయి జిల్లాలోని రొద్దం మండలంలో క్షేత్ర స్థాయి పర్యటన జరిపింది.

## రొద్దం మండలంలో పర్యటన

**రొద్దం** : కేంద్ర కరువు బృందం బుధవారం మధ్యాహ్నం శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలంలో ఆర్.కొట్టాల, చెరుకూరు గ్రామాల్లో పర్యటించారు. 2023-24 రబీ సీజన్లో పప్పుశనగ సాగుచేసి పంట నష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులతో ముఖాముఖి చర్చలు నిర్వహించి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఆర్.కొట్టాల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్రీయ పథకాల అమలుపై సమీక్షించారు. చెరుకూరులో ఆవని సేంద్రీయ వ్యవసాయ వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతుల ముఖాముఖిలో పాల్గొన్నారు. ఆర్.కొట్టాలకు చెందిన రైతు రమేష్, చెరుకూరు గ్రామానికి చెందిన రైతు నర్సింహ్మప్ప తదితరులు పంట నష్టంను కరువు బృందం సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రైతులు కేంద్ర బందంతో మాట్లాడుతూ 2023-24లో తాము సాగు చేసిన పప్పుశనగ పంటను పూర్తిగా నష్టపోయామని తెలిపారు. కనీసం పెట్టుబడులు కూడా చేతికందలేదన్నారు. ఎకరాకు రూ.12 వేల వరకు నష్టపోయినట్లు చెప్పారు. పొలం కౌలుకు తీసుకుంటే అదనంగా మరో రూ.5వేలు నష్టం వాటిల్లిందన్నారు. ఉపాధి పనులు కూడా సక్రమంగా జరగలేదన్నారు. బిల్లులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. పాడి రైతుల నుంచి పాలు కొనుగోలులో కూడా పాల కంపెనీలు మోసం చేస్తున్నాయని ఆర్.కొట్టాల గ్రామానికి చెందిన పాడి రైతు రమేష్ తెలిపారు. అనంతరం కేంద్ర బందం లీడర్ రితేష్ చౌహాన్ మాట్లాడుతూ పంట నష్టంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, కేంద్ర కరువు బృందం సభ్యులు డాక్టర్ కె.పొన్ను స్వామి, సునీల్ దుబే, జిల్లా వ్యవసాయ అధికారి వైవి.సుబ్బారావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సిపిఓ విజయకుమార్‌తో పాటు స్థానిక అధికారులు పాల్గొన్నారు.



ఆర్.కొట్టాల గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న కేంద్ర కరువు బృందం

### నేడు క్షేత్ర స్థాయి పరిశీలన

కేంద్ర కరువు బృందం నేడు క్షేత్ర స్థాయి పర్యటన జరపనుంది. విడపనకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ, కణేకల్ మండలాల్లో పర్యటించనుంది. పంట నష్టం పరిశీలన జరిపేందుకు అవకాశం లేనందున అక్కడి రైతులతో పంటనష్టం వివరాలను అడిగి తెలుసుకోనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూర్తి స్థాయి పర్యటన ఉండనుంది. అనంతరం బృందం రాత్రికి బెంగళూరుకు చేరుకుని శుక్రవారం నాడు విజయవాడలో రాష్ట్ర స్థాయి అధికారులతో మరోమారు సమావేశం అవనున్నారు.

# 29న జాతీయ లోక్ అదాలత్

## కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

## జిల్లా జడ్జి జి.శ్రీనివాస్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఈనెల 29వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ సూచించారు. బుధవారం సాయంత్రం అనంతపురం నగరంలోని జిల్లా కోర్టు ఆవరణం ఉన్న జిల్లా జడ్జి ఛాంబర్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై అనంతపురం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్.వి, సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, అనంతపురం ఎస్పీ గౌతమి శాలి, సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్వీ.మాధవరెడ్డి, తదితరులతో జిల్లా జడ్జి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి అవసరమైన కృషి చేయాలన్నారు. ఫోక్సో కేసుల కింద నష్టపరిహారానికి సంబంధించి ముగ్గురు బాధితులకు రూ.1 లక్ష, రూ.2.50 లక్షలు, రూ.5 లక్షల చొప్పున పరిహారం మంజూరు చేసినట్లు చెప్పారు. బాధితులకు పరిహారం అందించేందుకు హైకోర్టుకు ఉత్తరం రాశామన్నారు.

**ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్‌కు సన్మానం**

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం, ఇతర సమస్యల పట్ల స్పందనకు కతజ్ఞతగా ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్‌ను జిల్లా జడ్జి కలెక్టర్, ఎస్పీల సమక్షంలో శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

# మంత్రి పయ్యావుల బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి-వజ్రకరూరు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభ కార్యాలయంలో బుధవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ముందుగా టీడీఎల్పీలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం శాసనసభ కార్యాలయంలో శాసనసభ వ్యవహారాల బాధ్యతలను స్వీకరించారు. శాసన సభ ఏర్పాట్లకు చెందిన ఫైల్స్‌పై తొలి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతున్న రానున్న శాసన సభ సమావేశాల్లో రాష్ట్ర అభివద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించి అర్థవంతమైన చర్చలు జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. జవాబుదారీతనంతో కూడిన పారదర్శకమైన పాలన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్ర ప్రజలకు అందించేందుకు కషి చేస్తామన్నారు. శాసన సభ కార్యదర్శి పిపికె రామాచార్యులు, సంయుక్త కార్యదర్శి విజయరాజు, ఉప కార్యదర్శి కె.రాజకుమార్, పీఏవో కె.పద్మజ, స్టేట్ ఆడిట్ అధికారులు తదితరులు మంత్రి పయ్యావుల కేశవ్‌కు అభినందనలు తెలియజేశారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న పయ్యావుల కేశవ్


కరువు బృందంకు నాయకత్వం వహించిన రితీష్ చౌదరితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

# జిల్లా రైతాంగాన్ని ఆదుకోండి

## కేంద్ర బృందానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వినతి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

కరువుతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న అనంతపురం జిల్లా రైతులను ఆదుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కేంద్ర కరువు బృందం సభ్యులను కోరారు. ఉమ్మడి రబీ కరువు పరిస్థితుల పరిశీలన నిమిత్తం వచ్చిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం లీడర్ రితేష్ చౌహాన్, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను బుధవారం నాడు రెవెన్యూ భవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. పంట నష్టంపై అన్ని అంశాలు పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**జెసి.ప్రభాకర్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి**

మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడు తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డిని అనంతురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కలిశారు. బుధవారం అనంతపురంలోని వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై చర్చించుకున్నారు.

# విధులు అప్రమత్తంగా నిర్వర్తించాలి

## నైరుతి రైల్వే డిఆర్ఎం హర్షఖరే

**ప్రజాశక్తి-రాయదుర్గం**

రైలు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని నైరుతి రైల్వే హుబ్లీ డివిజనల్ రైల్వే మేనేజర్ హర్ష ఖరే సిబ్బందికి సూచించారు. డిఆర్ఎం బుధవారం ఉదయం రాయదుర్గం రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాత భవనాన్ని, నిర్మాణం పూర్తయిన కొత్త స్టేషన్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం ప్లాట్‌ఫారం పైనే రైల్వే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రైల్వే శాఖలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందితో విధి నిర్వహణపై సమీక్షించారు. ఇటీవల ఉత్తర భారతంలో జరిగిన రైలు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రమాదాలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం పనికిరాదని, షార్ట్ కట్ మార్గాల్లో వెళ్లరాదని సిబ్బందికి మార్గ నిర్దేశనం చేశారు. రైల్వే వినియోగదారుల సలహా మండలి పూర్వ సభ్యులు, రాయదుర్గం హెరిటేజ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి గుడేకోట శివకుమార్, రాయదుర్గం రైల్వే యాక్షన్ కమిటీ ప్రతినిధి జయంతి సురేష్ కుమార్ డిఆర్ఎంను కలిసి వినతి పత్రం ఇచ్చారు. రైల్వే స్టేషన్ కొత్త భవనాన్ని వెంటనే ప్రారంభించాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని, బళ్లారి-రాయదుర్గం డెమో రైలు సేవలను ప్రవేశపెట్టాలని, కదిరిదేవరపల్లి తిరుపతి రైలు సర్వీసును పున:ప్రారంభించాలని కోరారు. డిఆర్ఎం వెంట సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సంతోష్‌హెగ్డే, డివిజినల్ ఆపరేషన్ మేనేజర్ భట్టాచార్య, ఇతర అధికారులు ఉన్నారు.



ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రవేశద్వారాన్ని పరిశీలిస్తున్న డిఆర్ఎం హర్ష ఖరే


ఆర్ఐఓకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

# ఎస్ఆర్ జూనియర్ కళాశాలను సీజ్ చేయండి


## ఆర్ఐఓకు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

నిబంధనలకు విరుద్ధంగా ఎస్ఆర్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్ఐఓ వెంకటరమణ నాయక్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ ఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కళాశాల పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాలను విక్రయిస్తోందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు పట్టికను కళాశాలలో ఏర్పాటు చేయకుండా ఇష్ట రాజ్యాంగ విద్యార్థులు తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు రూపంలో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. కళాశాలలో తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకురాలు రజిత, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దు, నగర నాయకులు భీమేష్, చందు తదితరులు పాల్గొన్నారు.


## 'ఉపాధి' బకాయి బిల్లులు చెల్లించాలి : వ్యకాసం

**శింగనమల :** ఏడు వారాలుగా పెండింగ్‌లో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ బిల్లులు చెల్లించి కూలీలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. శింగనమలలో బుధవారం నిర్వహించిన ఏపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయ కూలీలు రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిలో ఉన్నారన్నారు. కావున ఉపాధి కూలీలు వలస పోకుండా గ్రామాల్లోనే పనులు కల్పించాలన్నారు. ఏడాదిలో 200 రోజులు పని దినాలు కల్పిస్తూ రోజుకు రూ. 600 కూలి ఇవ్వాలని కోరారు. ప్రధానంగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న 7 వారాల బిల్లులను వెంటనే కూలీల ఖాతాల్లో జమ చేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, కూలీలకు పనిముట్లు, మెడికల్ బాక్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ చట్టంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి సుంకన్న, ఎర్రిస్వామి, రామాంజనేయులు, ఆంజనేయులు, కుళ్లాయప్ప, జయరాముడు, సూర్యప్రకాష్, మునెప్ప, వెంకటస్వామి, లక్ష్మీనారాయణ, పుల్లన్న, రుషింగప్ప, కేశన్న, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

# పేదల మనిషి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్


ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

పేద ప్రజల అభ్యున్నతి కోసం అనునిత్యం తపించిన వ్యక్తి ఫాదర్ ఫెర్రర్ అని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. బుధవారం నాడు ఫాదర్ ఫెర్రర్ 15వ వర్ధంతిని పురస్కరించుకుని అనంతపురం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఫాదర్‌ఫెర్రర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. నిరుపేదలకు సేవలు అందించే విధంగా ఆర్డీటీ సంస్థను ఫాదర్ ఫెర్రర్ నెలకొల్పారన్నారు. పేదల విద్య, వైద్యం కోసం ఆయన ఎంతో శ్రమించారన్నారు. ఫాదర్ ఫెర్రర్ భౌతికంగా లేకపోయినా.. ఆ సేవలు ఇప్పటికీ ఆర్డీటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచి హరి, తెలుగుయువత నాయకుడు లింగారెడ్డి, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు, తెలుగుదేశం పార్టీ నాయకులు నెట్టెం బాలకృష్ణ, వెంకటేశ్వర రెడ్డి, చేపల హరి, గూడిపూటి సురేష్ చౌదరి, ఓంకార్ రెడ్డి పాల్గొన్నారు.

**జిల్లా గ్రంథాలయంలో..**

అనంతపురం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు నివాళులు అర్పించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, ఫెరర్ చిత్ర పటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది సి.ఇంతియాజ్ అహ్మద్, రామంజినమ్మ, హేమమాలిని, శ్రీవిజయ, నాగమణి, సరస్వతమ్మ, ఉజ్జినేశ్వరి, గంగాధర్ పాల్గొన్నారు.


కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ జాతీయ మాజీ అధ్యక్షులు, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం నాడు అనంతపురం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్ గాంధీ చిత్రపటం ఎదుట నాయకులు కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ పాలన దేశానికి అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు దాదా గాంధీ, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు సాకే శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కాపు గాజుల వాసు తదితరులు పాల్గొన్నారు.

# చదువుకు ప్రభుత్వ ప్రోత్సాహం

## ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

విద్యార్థుల చదువుకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం అందిస్తుందని దానిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కొర్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. బడి బయట ఉండే పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, తహశీల్దార్ హనుమాన్ నాయక్, ఎంఇఓ లింగానాయక్ పాల్గొన్నారు.


పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

# అభివృద్ధికి నోచుకోని గూగూడు..!

**ప్రజాప్రతినిధుల హామీలు నీటిమూటలేనా..**
**7 నుంచి కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు..**
**భక్తులకు ఇబ్బందులు తప్పవా..**

**ప్రజాశక్తి-నార్పల**

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కలియుగ ప్రత్యక్ష దైవం గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలు జులై 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. దశాబ్దాల కాలం నుంచి ఏటా గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వాలు, ప్రజాప్రతి నిధులు మారుతున్నారే కానీ గూగూడు గ్రామ అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. బ్రహ్మోత్సవాల సమయంలో కుళ్లాయిస్వామి దర్శనార్థం వచ్చే ప్రజాప్రతి నిధులు గూగూడు గ్రామాన్ని జిల్లాలోనే గొప్ప పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతా మని హామీలు ఇవ్వడం పరిపాటిగా మారింది. మత సామరస్యనికి ప్రతీకగా నిలిచిన కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వామి జంట ఆలయాలను సర్వాంగ సుందరంగా రూపుదిద్ది, భక్తుల సౌకర్యార్థం ఆలయాల చుట్టూ ఉన్న గృహాలను తొలగించి పరిసరాలను విశాలం చేస్తామని, విశాలమైన రోడ్లు వేస్తామని హామీల వర్షం కురిపించన సందర్భాలు అనేకం. ఆ మేరకు జిల్లా స్థాయి అధికారులు ఆలయ ఆవరణలో తూతూ మంత్రంగా రెండు మూడు సార్లు సమావేశాలు నిర్వహించి అదిగో చేస్తున్నాం.. ఇదితో చేసేస్తున్నాం అంటూ హడావుడి చేశారు కానీ ఆ దిశగా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు మొదలుకొని ఏడాది మొత్తం భక్తులు స్వామికి సమర్పించే కానుకల ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయం వస్తోంది. అయినా అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

**రంగుల రాజకీయ మళ్లీ మొదలవుతోందా.?**

గతేడాది గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల సమయంలో వైసిపి ప్రభుత్వంలో స్వామి ఆలయానికి ఉన్న సంప్రదాయ రంగులకు విరుద్ధంగా రంగులు వేశారు. దీంతో గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయి ఆలయ ఆవరణలోనే తీవ్ర వాగ్వావాదానికి దిగారు. ఒకానొక దశలో దాడులు చేసుకునే స్థితికి వెళ్లగా అధికారులు, పోలీసులు, చాకచక్యంగా వ్యవహరించి పరిస్థితిని చక్కదిద్ది ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. ప్రస్తుతం మరోసారి అంతర్గతంగా రంగుల రాజకీయం నడుస్తోందని పలువురు చర్చించుకుంటున్నారు.

**మద్యం అమ్మకాలను నియంత్రించి పవిత్రతను కాపాడాలి**

బ్రహ్మోత్సవాల సమయంలో గూగూడు



గ్రామంలో మద్యం అమ్మకాలను నియంత్రించాలని భక్తులు కోరుతున్నారు. బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. చాలామంది బ్రహ్మోత్సవాలు ముగిసే వరకూ కాళ్లకు పాదరక్షలు కూడా ధరించారు. ఇంత పవిత్ర ప్రాంతంలో బ్రహ్మోత్సవాల సమయంలో మద్యం అమ్మకాలను చూసి భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు గూగూడు పవిత్రతను కాపాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో మద్యం అమ్మకాలను నియంత్రించాలని కోరుతున్నారు. అలాగే భక్తుల సంఖ్యకు అనుగుణంగా విశ్రాంతి వసతులు, మరుగుదడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలని, మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు.

# పోలీసు బందోబస్తు నడుమ వేలం

**ప్రజాశక్తి-నార్పల**

నార్పల మేజర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం పోలీసు బందోబస్తు మధ్య బస్టాండ్, వారపు సంత, మరుగుదొడ్ల వేలం పాట నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకూడదనే ఉద్దేశంతో అధికారులు ముందస్తుగానే పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎఎస్ఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో రాముడు, సర్పంచి సుప్రియ ఆధ్వర్యంలో పంచాయతీ వేలం పాటలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శైలజారాణి, ఉపసర్పంచి శ్రీరాములు, మేజర్ పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, కార్యదర్శులు చరణ్, శ్రీనివాసులు, పరశురాం, సచివాలయ సిబ్బంది, వేలం పాటదారులు, తదితరులు పాల్గొన్నారు.

**రెండు వేలాలు వాయిదా**

స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచి ఎం.సుప్రియ ఆధ్వర్యంలో బస్టాండ్, సంత మార్కెట్, మరుగుదొడ్ల సుంకం వసూలుకు వేలం పాటలు నిర్వహించగా సంత మార్కెట్‌ను ప్రసాద్ నాయుడు రూ. 2.7లక్షలకు దక్కించుకున్నాడు. అయితే బస్టాండ్, మరుగుదొడ్ల వేలం పాటను జులై 2వ తేదీకి వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.



వేలంలో పాల్గొన్న అధికారులు

# కీటక జనిత వ్యాధులపై అవగాహన

**ప్రజాశక్తి-వజ్రకరూరు**

మలేరియా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఉరవకొండ మండలంలోని మోపిడి, చిన్న ముష్టూరు గ్రామాల్లో కీటక జనిత వ్యాధులపై రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పిహెచ్‌సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగ, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి.షఫీ, వైద్య సిబ్బందితో కలిసి ఆయా గ్రామాలను సందర్శించి డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. దోమ కాటు వల్ల డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. దోమలు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతాయని, కావున అనవసర నీటి నిల్వలు ఉండకుండా చూడాలని, నీటిని నిల్వ ఉంచిన బిందెలు, డ్రమ్ములపై మూతలు ఉంచాలని సూచించారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. చలి, జ్వరం, చెమటలు పట్టడం మలేరియా లక్షణాలు అన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే సమీప వైద్యులను సంప్రదించాలన్నారు. అనంత రం కీటక జనిత వ్యాధులపై అవగాహన కోసం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ శేఖర్, సిఒ.భగవాన్ దాస్, ఎఎన్ఎం.అనూష, హెల్త్ అసిస్టెంట్ రాఘవేంద్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న పిహెచ్‌సి సిబ్బంది

# 29న లోక్ అదాలత్

**గుత్తి** : ఈ నెల 29వ తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై బుధవారం గుత్తి పట్టణంలో న్యాయ మూర్తులు పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో మండల న్యాయ సేవా సమితి అధ్యక్షులు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథాచారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడు తూ జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో సివిల్, క్రిమినల్, ఎంవిఒపిలు, ఎన్ఐ యాక్ట్, మెయిం టెనెన్స్, పిఎల్‌సి కేసులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో సిఐ ఎం. వెంకటరామిరెడ్డి, న్యాయవాదులు విసి.గంగాధర్‌కుమార్, టి.శ్రీనివాసులు, జె.కృష్ణ, డి.మల్లేష్, టైపిస్టు ఎస్.సాధిక్‌వలి, తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌పై సమావేశమైన జడ్జిలు

# 'అనంత'లో నేడు యోగాపై ర్యాలీ

**అనంతపురం** : జూన్ 20వ తేదీ 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' సందర్భంగా గురువారం ఉదయం 7.30 గంటలకు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నగరంలోలని వివేకానంద యోగా కేంద్రం నిర్వాహకులు తెలిపారు. ర్యాలీ స్థానిక ఆర్ట్స్ కాలేజీ నుంచి బయల్దేరి టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిళ్ల మీదుగా తిరిగి ఆర్ట్స్ కాలేజీకి చేరుతుంది. ర్యాలీలో ఆయూష్ శాఖతో పాటు నగరం లోని అన్ని యోగా సంస్థల సభ్యులు పాల్గొంటారు. ఆర్ట్స్ కాలేజీ ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విభాగం విద్యా ర్థులు, పతంజలి భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, బ్రహ్మకుమారీస్, సత్యసాయి ధ్యాన మండలి, హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్, పలు ప్రయివేట్ విద్యాసంస్థల బాల బాలికలు పాల్గొంటారు. యోగాపై ఆసక్తి ఉన్న ప్రతిఒక్కరూ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

# విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

**శింగనమల** : మండలంలోని శోధనపల్లి గ్రామం ఎస్సీ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో బుధవారం ఉపాధ్యాయు రాలు మొబీన 42 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య, నోట్ పుస్తకాలతో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాల, తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అలాగే ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను రోజూ సక్రమంగా పాఠశాలకు పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే జయరామ్‌ను కలిసిన గుత్తి నాయకులు

**గుత్తి** : గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను బుధవారం గుత్తి పట్టణానికి చెందిన టిడిపి నాయకులు కర్నూలు జిల్లా ఆలూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేని గుమ్మనూరు నారాయణ, దిల్‌కా శీన, బి.వేణుగోపాల్ తలపాగా, శాలువాతో ఘనంగా సత్కరించారు. కూటమి విజయంతో గుంతకల్లు నియోజకవర్గానికి మంచి రోజులు వచ్చాయని నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేని కలిసిని వారిలో మాజీ ఎంపీటీసీ బి.కుమార్, నాయకులు బేతాపల్లి రమేష్, ఇస్మాయిల్, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే జయరామ్‌ను సత్కరిస్తున్న టిడిపి నాయకులు



మంత్రి లోకేష్‌కి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకుల సంఘం నాయకులు

# మంత్రి లోకేష్‌కి అధ్యాపకుల సంఘం శుభాకాంక్షలు

**అనంతపురం** : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను బుధవారం మంగళగిరిలో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో త్వరితగతిన ప్రవేశాల ప్రక్రియ చేపట్టాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు డా. జయప్ప కురుబ, కార్యదర్శి డా. శ్రీధర్ కోనంకి, రాష్ట్రీయ మహాసంగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగినేని రంగనాథం, కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డా. గుత్తా రాజశేఖర్ ఉన్నారు.

# వ్యక్తిపై కేసు నమోదు

**పుట్లూరు** : మండలంలోని గాండ్లపాడు గ్రామంలో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన తలారి నారాయణస్వామి మద్యం మత్తులో వీధిలో ఉన్న మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు వారిని దుర్భాషలాడాడు. అలాగే తలారి గోపాల్ మిద్దె గోడకు, ఇమాం హుస్సేన్ కాంపౌండ్ గోడను ట్రాక్టర్‌తో డ్యామేజ్ చేశాడు. తలారి గోపాల్ ఫిర్యాదు మేరకు నారాయణస్వామిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# 21 నుంచి రాజయోగ శిక్షణ

**రాయదుర్గం** : 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' సందర్భంగా ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకూ రాయదుర్గంలోని ప్రజాపిత బ్రహ్మ కుమారి ఈశ్వరయ్య విశ్వవిద్యాలయంలో ఉచిత రాజ యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వ విద్యాలయ సంచాలకులు బికె.యోగేశ్వరి బుధ వారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ ప్రతి రోజూ శిక్షణ ఉంటుందన్నారు. రాజ యోగతో మానసిక, శారీరక, ఆరోగ్యంతో పాటు జీవనంలో సంపూర్ణ సుఖశాంతులు, ఆనందం పొందవచ్చన్నారు. రాయదుర్గం పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యోగేశ్వరి సూచించారు.

# శివాజీ విగ్రహానికి పాలాభిషేకం

**పామిడి** : పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో బుధవారం హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషిక్తుడై 350 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శివాజీ మహారాజ్ విగ్రహానికి పాలాభిషేకం చేసి ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జోజోడే కుమార్, పత్రా శ్రీనివాసులు, హిందువులు అనేక మంది పాల్గొన్నారు.

# 24న గూగూడులో తలనీలాల వేలం

**నార్పల** : మండలంలోని గూగూడు గ్రామంలో గూగూడు కుళ్లాయిస్వామికి భక్తులు సమర్పించే తలనీలాలను పోగు చేసుకునే హక్కు కోసం ఈ నెల 24వ తేదీ(సోమవారం) ఆలయ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకేతపురం శోభ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా రూ. లక్ష ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

# ఇసుక టిప్పర్ సీజ్

**పెద్దపప్పూరు** : మండలంలోని జూటూరు గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ గౌస్ తెలిపారు. ఇసుక లోడ్‌తో వస్తున్న టిప్పర్‌ను జూటూరు సమీపంలో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే ఎవరైనా, ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

# ప్రజా జీవనానికి ఇబ్బందులు కలిగించొద్దు

**రైల్వే ప్రహరీలను వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ధర్నా**

**ప్రజాశక్తి-గుంతకల్లు**

రైల్వే అధికారులు పట్టణంలోని రైల్వే ప్రాంత సరిహద్దుల్లో ప్రహరీలు నిర్మించి వివిధ కాలనీల ప్రజల జీవనానికి ఇబ్బందులు కలిగించడం సబబు కాదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు వైటిసి రమేష్, డివైఎఫ్ఐ నాయకుడు సురేంద్రబాబు పేర్కొన్నారు. పట్టణంలోని పలు కాలనీలను దిగ్బంధం చేస్తూ రైల్వే అధికారులు గోడలు నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం వారు ప్రజలతో కలిసి మస్తాన్ పేట వద్ద నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రైల్వే ప్రాంతంలో చర్చి స్కూల్, చందమామ స్కూల్, రైల్వే హైస్కూల్, రైల్వే సెంటర్ స్కూల్, తదితర పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చాలా మంది రైల్వే ఉద్యోగుల పిల్లలతో పాటు బయటి పిల్లలు చదువుతున్నారని, వీరు రాకపోకలు సాగించే మార్గాలను మూసి వేయడం వల్ల విద్యార్థులు చాలా దూరం ప్రయాణించి స్కూళ్లకు రావాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందన్నారు. అలాగే రైల్వే కాలనీ ప్రజలు, ఉద్యోగులతో పాటు ఇతర కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిరుద్యోగ యువకులు రైల్వే స్టేషన్‌లో టీ, సమోసా, ఇతర ఆహార పదార్థాలు అమ్ముకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. ఈ రహదారులను మూసివేస్తే ప్రతి ఒక్కరికీ ఆటంకం కలుగుతుంద న్నారు. రైల్వే హాస్పిటల్‌కు ఎమర్జెన్సీగా వెళ్లాలన్నా చాలా దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. కావున రైల్వే ఉన్నతాధికారు లు అడ్డంగా నిర్మిస్తున్న గోడలను తొలగించి, యథావిధిగా దారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మస్తాన్ పేట వాసులు జ్యోతి, షాషావలి, వీరేష్, బుజ్జి, గిరి, లక్ష్మీదేవి, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



మస్తాన్ పేట వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు, ప్రజలు

# తాగునీటి సరఫరాను మెరుగుపరచండి

**ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**

**ప్రజాశక్తి-రాయదుర్గం**

రాయదుర్గం పట్టణానికి తాగునీరు అందించే కణేకల్ వద్ద ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ రక్షిత తాగునీటి పథకం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును బుధవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పరిశీలించారు. రాయదుర్గం పట్టణ ప్రజలకు సక్రమంగా తాగునీరు సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీటి నిల్వపై కమిషనర్ కిషోర్, ఇంజినీర్ సురేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్లు ప్రశాంతి, మాజీ కౌన్సిలర్ టంకసాల హనుమంతు, టిడిపి పట్టణ కన్వీనర్ పసుపులేటి నాగరాజు, డి.హీరేహాల్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి ఉన్నారు.



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ

# గ్రామాల్లో 'అంగన్వాడీ పిలుస్తోంది' ర్యాలీ

**ప్రజాశక్తి-గుమ్మగట్ట**

గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం డే సందర్భంగా బుధవారం మండలంలోని గలగల, పైదొడ్డి, దొడ్లయ్యదొడ్డి గ్రామాల్లో అంగన్వాడీ పిల్లలతో బడిబాట ర్యాలీ నిర్వహించినట్లు సూపర్వైజర్ అంజనమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని సెంటర్లలో ఈ మాసమంతా గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరేళ్లు నిండిన పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్చడం, మూడేళ్ల పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్చడమే ఈ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశం అన్నారు. గలగల గ్రామంలో 18 మంది, పైదొడ్డిలో 13 మంది, దొడ్లయ్యదొడ్డి గ్రామంలో ఐదుగురు పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించినట్లు, పిల్లల తల్లిదండ్రులకు చదువు విశిష్టతను వివరించినట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందుతుందన్నారు. పిల్లలు బడికి వచ్చేలా ఆటపాటలతో సంసిద్ధత పరుస్తున్నట్లు తెలిపారు. మూడేళ్లు పైబడిన పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ర్యాలీ ద్వారా ప్రజలకు తెలిపారు. గలగల గ్రామ సర్పంచి సిద్ధప్ప మాట్లాడుతూ బడిఈడు పిల్లలను బడిలో చేర్చేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు పంచాయతీ నుంచి ఎప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్లు శోభారాణి, మల్లేశ్వరి, హేమలత, ఆయాలు లక్ష్మీదేవి, శాంతమ్మ, లక్ష్మీ, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంగన్వాడీ పిల్లల చేత ర్యాలీ చేపట్టిన కార్యకర్తలు

# ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు నివాళి

**ప్రజాశక్తి-గుత్తి**

ఆర్‌డిటి వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా బుధవారం మండలంలోని తురకపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎం.ఈరన్న ఆధ్వర్యంలో ఆర్డీటీ పాఠశాల వద్ద ఉన్న ఫెర్రర్ విగ్రహానికి నాయకులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

**వజ్రకరూరు** : ఆర్‌డిటి వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సేవలు ఎనలేనివని దళిత గిరిజన హక్కుల సాధన సమితి అధ్యక్షులు గోపాల్ కొనియాడారు. ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఉరవకొండ మండలంలోని లత్తవరం గ్రామంలో దళిత గిరిజన హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోపాల్ మాట్లాడుతూ ఫాదర్ ఫెర్రర్ స్పెయిన్ దేశం నుంచి వచ్చి అనంతపురంలో 1969లో ఆర్‌డిటి సంస్థను స్థాపించి ఎస్సీ, ఎస్టీలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించారన్నారు. మహిళా సాధికారత కోసం మహిళా సంఘాలు ఏర్పాటు చేసి పొదుపు చేసుకునే విధంగా ప్రోత్సహించారన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు పక్కా భవనాలు కట్టించారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆర్‌డిటి సహాయ సహకారాల తో నేడు ప్రతి గ్రామంలో ఉద్యోగులు ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిజిహెచ్ఎస్ నాయకులు చంద్రశేఖర్, సోమశేఖర్, రమేష్, భారతి, భాస్కర్, గ్రామస్తులు భీమలింగమ్మ, లక్ష్మీదేవి, ఎం.పోలన్న, పోలేరయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గోపాల్

# 'ఉపాధి' కూలీల శాతం పెంచాలి : ఎంపీడీవో

**ప్రజాశక్తి-బెళుగుప్ప**

మండల వ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల శాతం పెంచాలని ఎంపీడీవో సుబ్బరాజు ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఉపాధి కూలీల శాతం పెంచాలన్నారు. అలాగే లేబర్ రిపోర్టింగ్, హార్టీకల్చర్ సర్వైవల్ క్యాప్చర్, జిజిఐ, తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 250 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటేందుకు అనుమతి వచిందని, మొదటి విడత కింద వంద ఎకరాల్లో మొక్కలు నాటేందుకు ప్రతిపాదించామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ఇంజినీర్ శివారెడ్డి, సూర్యప్రకాష్, జేఈ జయలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ నాగేంద్రప్ప, స్వాతి, అరవింద్, కంప్యూటర్ ఆపరేటర్ నిర్మల, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్బరాజు

# 'ఊడిగం చేయించుకుని మోసం చేశారు' : వాలంటీర్లు

**ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్**

ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో మా చేత ఊడిగం చేయించుకుని మమ్మల్ని మోసం చేశారని గ్రామ, వార్డు వాలంటీర్లు బుధవారం గుమ్మనూరు నారాయణస్వామి ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్లు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి నాయకులు ఎన్నికల సమయంలో మా చేత రాజీనామా చేయించి వైసిపి ప్రభుత్వం రాగానే వాలంటీర్ పోస్టులు ఇస్తామని నమ్మించి నట్టేట ముంచేశారని వాపోయారు. స్పందించిన నారాయణస్వామి ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ బండారు ఆనంద్, మస్తానప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.



నారాయణస్వామికి వినతిపత్రం ఇస్తున్న వాలంటీర్లు



గ్రామంలో పర్యటించిన ఇఒఆర్‌డి దాస్

**ప్రజాశక్తి కథనానాకి స్పందన**

# గ్రామాల్లో పారిశుధ్యం చర్యలు

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

మండలంలోని పలు గ్రామాల్లో 'పారిశుధ్యం పడకేసింది' శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఇఒఆర్‌డి దాస్ ఆయా గ్రామాలకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. ఉద్దేహాల్ గ్రామంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శితో పారిశుధ్యం మెరుగు చర్యలు చేపట్టడం తో పాటు దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ స్ప్రేయింగ్ చేయించారు. వారు మాట్లాడు తూ గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి శివయ్య, వైద్య సిబ్బంది జైనాబి, గోవర్ధన, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాస్‌యాదవ్ ఎంపికపై హర్షం

**ప్రజాశక్తి-శింగనమల**

టిడిపి ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్లు పడిన కష్టం, పార్టీ బలోపేతం కోసం చేసిన కృషిని గుర్తించి యాదవ సామాజిక వర్గానికి చెందిన పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమించడం పట్ల టిడిపి జిల్లా తెలుగు యువత మాజీ కార్యదర్శి కాయల రాజశేఖర్ యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పల్లా శ్రీనివాస్‌ను టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు రాజశేఖర్ యదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈయన నియామకం ద్వారా పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని చంద్రబాబు మరోమారు నిరూపించారని కొనియాడారు.



రాజశేఖర్ యాదవ్

# గ్రంథాలయం తనిఖీ

**ప్రజాశక్తి-పుట్లూరు**

ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ బుధవారం పుట్లూరు గ్రంథాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, ఫైల్స్‌ను పరిశీలంచారు. గ్రంథాలయ సభ్యత్వం పెంచేందుకు, సెస్ వసూలుకు మరింత కృషి చేయాలని స్థానిక గ్రంథాలయ అధికారి ఎస్.జయరాములును ఆమె ఆదేశించారు.



రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి రమ